సాక్షి నిర్మల్

ఆదివారం । 6 । అక్టోబర్ । 2024



గోదారమ్మ చెంతకు..

అడెల్లిలోని గంగనీళ్ల జాతర శనివారం ప్రారంభమైంది. గోదావరి చెంతకు అమ్మ వారి ఆభరణాలను భక్తులు కాలినడకన తర లించడంతో జాతర మొదలైంది. 8లో▸



సేటు చెప్పిందే రేటు 9లో▸

మొక్కజొన్న పంట చేతికొస్తున్నా.. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. దీంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు అమ్ము కుని నష్టపోతున్నారు.

గరిష్టం/కనిష్టం
33.1 /23.1

వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. మధ్యాహ్నం వేడిగా ఉంటుంది. ఒకటి రెండు చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో వెంకటస్వామి జయంతి వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలను ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ జ్యోతిప్రజ్వలన చేసి అధికారికంగా జయంతి ఉత్సవాలు జరిపారు. సీపీవో జీవరత్నం, డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, సంక్షేమ శాఖల అధికారులు రాజేశ్వర్‌గౌడ్, శ్రీనివాస్, అంబాజీ, శంకర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలం పాటు కేంద్ర మంత్రిగా, పార్లమెంటు సభ్యుడిగా ప్రాతినిధ్యం వహించిన వెంకటస్వామి దళిత, బడుగు, బలహీన, అణగారినవర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. వేడుకల్లో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ కార్యాలయంలో..



నివాళులర్పిస్తున్న ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్ టౌన్: జిల్లా ప్రధాన పోలీస్ కార్యాలయంలో కేంద్ర మాజీమంత్రి జి.వెంకటస్వామి జయంతి వేడుకలు నిర్వహించారు. ఎస్పీ జి.జానకీషర్మిల వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. సుదీర్ఘకాలం కేంద్ర మంత్రిగా, పార్లమెంటు సభ్యుడిగా ప్రాతినిధ్యం వహించిన వెంకటస్వామి దళిత, బడుగు, బలహీన, అణగారినవర్గాల అభ్యున్నతి కృషి చేశారని కొనియాడారు.

టీచర్లు కావాలి



వినతిపత్రం ఇస్తున్న ఎలగడప గ్రామస్తులు

కడెం: మండలంలోని ఎలగడప గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు అదనపు టీచర్లు కావాలని గ్రామస్తులు డీఈవో రవీందర్‌రెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో 30 మంది విద్యార్థులకు ఒకటీచర్ ఉన్నారని, అదనంగా మరో ఇద్దరిని కేటాయించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో రమేశ్, రహీం, రాజేశ్వర్, లక్ష్మణ్, తదితరలు ఉన్నారు.

కూరుకుపోయిన లారీ



బురదలో దిగబడిన పీడీఎస్ బియ్యం లారీ

భైంసారూరల్: మండలంలోని మాటేగాం గోదాంలో నిల్వ ఉన్న పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న లారీ శనివారం బురదలో కూరుకుపోయింది. భైంసాకు వస్తున్న లారీ గోదాం సమీపంలో ఒకవైపు టైర్లు పూర్తిగా బురదలో కూరుకుపోయాయి. ఇటీవలి వర్షాలకు గోదాం ప్రాంతంలో నీరు నిలువడంతో లారీ బురదలో కూరుకుపోయింది. ఇదే గోదాంలో శనివారం సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సోయా లోడుతో వెళ్లే ట్రాక్టర్లు, ఆటోలు ఈ బురద రోడ్డులో కూరుకుపోకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

వట్టివేరు మొక్కల పెంపకానికి స్థల పరిశీలన



చందారం సమీపంలో స్థలాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీవో విజయలక్ష్మి

మామడ: మండలంలోని న్యూసాంగ్వి గ్రామ పంచాయితీ పరిధిలోని చందారం సమీపంలో వట్టివేరు మొక్కలు పెంపకానికి స్థలాన్ని డీఆర్డీవో విజయలక్ష్మి శనివారం పరిశీలించారు. వట్టివేరు మొక్కల పెంపకంతో పశువులకు పశుగ్రాసం అందించడంతోపాటు భూగర్భ జాలాలు కలుషితం కాకుండా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగాసాగర్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీవో శివాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

నువ్వే శక్తి నీలో..



- అమ్మవు నీవే.. ఆదిశక్తివీ నువ్వే
- అన్ని శక్తులూ విస్మరించి.. అవస్థలు
- శక్తి స్వరూపిణే.. కావాలి స్ఫూర్తి



అభిలాష అభినవ్, కలెక్టర్



జానకీషర్మిల, ఎస్పీ



విజయలక్ష్మి, డీఆర్డీవో



లక్ష్మి, ఇరిగేషన్ ఈఈ



నాగినిభాను, డీఎఫ్‌వో



సరోజ, డీటీవో



పద్మ, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్

నిర్మల్: సమాజానికి ఆడదే ఆధారం. ఏ వ్యవస్థ నడవాలన్నా స్త్రీమూర్తే మూలాధారం. అమ్మగా, ఆలిగా, అమ్మాయిగా ఎన్నోరూపాల్లో కుటుంబవ్యవస్థలో భాగమవుతూనే.. ఉపాధ్యాయురాలిగా, ఉద్యోగస్తురాలిగా, ఉన్నతాధికారిగానూ ఎన్నో సామాజిక బాధ్యతలనూ మోస్తోంది. అలాంటి సర్వ శక్తిస్వరూపిణి తనలోని శక్తిని మర్చిపోయి, ఇటీవల దాడులకు గురవుతోంది. అశక్తురాలిగా మారి అడుగడుగునా అడ్డంకులు ఎదుర్కొంటోంది. గడప దాటింది మొదలు.. మళ్లీ ఇల్లు చేరేదాకా.. వేల కళ్లు చూసే తీరుతోనే ఆమె అణువణువూ నరకయాతన అనుభవిస్తోంది. రాక్షసత్వం చేతిలో తన చేతనత్వాన్ని కోల్పోతూ.. తనలోని శక్తిని విస్మరిస్తోంది. ఈ నవరాత్రుల్లో కేవలం దుర్గమ్మను పూజించడమే కాదు.. నారీ శక్తికి ప్రతిరూపమైన ఆ అమ్మను కొలుస్తూ.. ప్రతీ మహిళ తమలోని శక్తిని తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అబలలు సైతం అవసరాన్ని బట్టి సబలలుగా మారాలి.

మీలోనే అన్నిశక్తులు..

'ఏం చేస్తే ఏమవుతుందో.. సమాజంలో తమను ఏమనుకుంటారో..' అన్న అబల అమాయకత్వం, బలహీనతలే తనపై దాడులు పెరగడానికి కారణాలవుతున్నాయి. ఎప్పుడైతే స్త్రీమూర్తి తనలోని శక్తిని గుర్తించి, ఎదురుతిరిగిందో.. అక్కడ ఆమెదే విజయమైంది. నవరాత్రుల నేపథ్యంలో దుర్గమ్మను ఆరాధిస్తూనే.. ఆ శక్తిస్వరూపిణీలోని గుణాలనూ గమనించాలి.

తనకుతానే శక్తిని పెంచుకోవాల్సిన అవసరం ఉందన్న విషయాన్ని గుర్తించాలి. బాలబాలికలకు ఏది గుడ్ టచ్, ఏది బ్యాడ్ టచ్ అనే విషయాలపై అవగాహన కల్పించాలి. చదువుతోపాటే చిన్నతనం నుంచే కరాటే, జూడో వంటి ఆత్మరక్షణ విద్యలనూ నేర్పించాలి. అమాయకత్వం, నాజూకుతత్వంతోపాటు అవసరమైనప్పుడు ఆదిశక్తిగా ఎలా మారవచ్చో గుర్తించాలి.

నిర్మల్ జిల్లా.. మహిళల ఖిల్లా..

నిర్మల్ జిల్లా అంటేనే మహిళల ఖిల్లా. ఇక్కడ పురుషాధిక్యతను తలదన్నేలా స్త్రీల జనాభా ఉంది. కేవలం జనాభాలోనే కాదు.. అన్నిరంగాల్లోనూ అతివలు దూసుకుపోతున్నారు. తాజాగా డీఎస్సీ ఫలితాల్లోనూ అమ్మాయిలే సత్తాచాటారు.

- ఐఏఎస్ సాధించడమే కాదు.. పాలనాధికారిగా ఎక్కడా లేని విధంగా 'బాలశక్తి' వంటి వినూత్న కార్యక్రమాలను అమలుచేస్తున్నారు కలెక్టర్ అభిలాష అభినవ్..
- రాష్ట్రంలోనే సంచలనంగా మారిన ఎన్నోకేసులను పరిష్కరిస్తూనే.. వినాయక నవరాత్రులను చిన్నగొడవ కూడా లేకుండా సజావుగా పూర్తిచేశారు ఎస్పీ జానకీషర్మిల.
- వరుస ఎన్నికలు, ధరణితోపాటు నిత్యం ఎన్నో రెవెన్యూ సమస్యలు చుట్టుముడుతున్నా పరిష్కరిస్తూ సాగుతున్నారు నిర్మల్ ఆర్డీవో రత్నకల్యాణి.
- తను చేస్తున్న పనిలో ఆనందాన్ని వెతుక్కుంటూ, నిత్యం కొత్తదనం కోసం ఆరాటపడుతూ.. జిల్లాను రాష్ట్ర, జాతీయస్థాయిలో అవార్డులు సాధిస్తున్నారు డీఆర్డీవో విజయలక్ష్మి.
- తక్కువ వయసులోనే బరువైన ఇరిగేషన్ వ్యవస్థను చూస్తూ.. వర్షాలు, వరదలు, ప్రాజెక్టుల సమస్యలు, తాజాగా హైడ్రా వంటి వాటిని ఎదుర్కొంటూ విధులు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు నీటిపారుదలశాఖ ఈఈ లక్ష్మి.
- దట్టమైన అడవుల సంరక్షణలో తనవంతు పాత్ర పోషిస్తున్నారు డీఎఫ్‌వో నాగినిభాను..

కొత్తగా జిల్లా ట్రెజరీ అధికారిగా వచ్చిన సరోజ, జిల్లా ప్రభుత్వ పరీక్షల అధికారిగా పద్మ ఇలా వీరే కాదు.. ఎంతోమంది కీలక అధికారులుగా, ఉద్యోగులుగా, సిబ్బందిగానూ మహిళామణులే ఉన్నారు. వీరే కాదు.. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగానూ మరో మహిళాశక్తి సీతక్క ఉండటం గమనార్హం. వీరంతా శక్తిస్వరూపిణులే. ఎన్నో అవాంతరాలు దాటుకుని తమ లక్ష్యాన్ని చేరుకున్నవారే. తమ విధినిర్వహణలోనూ నిత్యం అడ్డంకులు ఎదురవుతున్నా.. విజయవంతంగా నిర్వర్తిస్తూ జిల్లాను ముందుకు తీసుకెళ్తున్నారు. ఈ నవరాత్రుల్లో సర్వశక్తి స్వరూపిణియైన దుర్గమ్మను ఆరాధిస్తూ తమలోని శక్తిని గుర్తించి విజేతలుగా నిలిచిన నారీమణులనూ స్ఫూర్తిగా తీసుకోవాల్సిన అవసరం ఉంది.

డిజిటల్ కార్డు సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

- ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి ఇలంబరిది



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి ఇలంబరిది

నిర్మల్‌చైన్‌గేట్: డిజిటల్ కార్డు సర్వే పకడ్బందీగా నిర్వహించాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రత్యేక అధికారి ఇలంబరిది అధికారులను ఆదేశించారు. నిర్మల్ కలెక్టరేట్‌లో డిజిటల్ కార్డుల సర్వేపై కలెక్టర్ అభిలాష అభినవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీలు, పంచాయతీలలో నిర్వహించిన సర్వేలో ఏమైనా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ, వార్డులో నిర్వహించిన సర్వే బృందాలతో వివిధ అంశాలపై చర్చించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఇలంబరిది మాట్లాడుతూ అర్హులైన ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించేలాప్రభుత్వం ఫ్యామిలీ డిజిటల్ కార్డులు జారీ చేస్తుందని తెలిపారు. కుటుంబంలోని వ్యక్తుల పేర్లు, జెండర్, పుట్టిన తేదీ, వయ సు, కుటుంబంతో ఉన్న సంబంధం, ఫొటో, ఆధార్ నంబర్, చిరునామా తదితర వివరాలన్నీ పక్కాగా నమోదు చేయాలన్నారు. అంతకుముందు కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన ప్రత్యేక అధికారికి కలెక్టర్, అదనపు కలెక్టర్ స్వాగతం పలి కారు. నిర్మల్, ఆదిలాబాద్, భైంసా ఆర్డీవోలు రత్నకళ్యాణి, వినోద్ కుమార్, కోమల్‌రెడ్డి, జెడ్పీసీఈవోలు గోవింద్, జితేందర్‌రెడ్డి, డీపీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ రాజు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఒంటెల కాపరి



సీఎంతో గల్ఫ్ కార్మికుడు రాథోడ్ నాందేవ్

నిర్మల్‌ఖిల్లా: ఉపాధి కోసం ఎడారి దేశం వెళ్లి.. కువైట్, సౌదీ అరేబియా సరిహద్దు ప్రాంతంలో ఒంటెల కాపారిగా కష్టాల అనుభవించిన ముధోల్ మండలం రువి గ్రామానికి చెందిన రాథోడ్ నాందేవ్ శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశాడు. హౌస్‌హోల్డ్ వీసాపై కువైట్ దేశానికి వెళ్లిన రాథోడ్ నాందేవ్‌ను అక్కడి అరబ్ యజమాని కువైట్ నుంచి అక్రమంగా సౌదీ అరేబియాకు తరలించాడు. ఒంటెల కాపరిగా పని అప్పజెప్పాడు. యజమాని హింసను తట్టుకోలేకపోతున్నానంటూ రక్షించాలని రాథోడ్ నాందేవ్ గత ఆగస్టులో ఏడుస్తూ సెల్ఫీ వీడియో విడుదల చేశాడు. అది సోషల్ మీడియాలో వైరల్ అయింది. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి వెళ్లగా కువైట్, సౌదీ అరేబియా దేశాల్లోని ఇండియన్ ఎంబసీ అధికారులతో, అక్కడి గల్ఫ్ సంఘాల నాయకులతో మాట్లాడించారు. నాందేవ్ స్వదేశానికి వచ్చేలా కృషి చేశారు. ముఖ్యమంత్రి చొరవతో స్వదేశానికి వచ్చిన రాథోడ్ నాందేవ్ తన కుటుంబ సభ్యులతో వెళ్లి రేవంత్‌రెడ్డిని కలిశారు. కృతజ్ఞతలు తెలిపారు. వీరివెంట నిర్మల్ జిల్లాకు చెందిన ప్రవాసిమిత్ర సంఘం నాయకుడు స్వదేశ్ పరికిపండ్ల ఉన్నారు .

ప్రభుత్వ ఉపాధ్యాయుడికి డాక్టరేట్



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు న్యాయ శాస్త్రంలో పీహెచ్‌డీ పట్టా సాధించారు. పట్టణానికి చెందిన సాజీద్ మెహరాజ్ స్థానిక గాజులపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉర్దూ మీడియం ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో న్యాయశాస్త్రంలో పీహెచ్‌డీ సాధించిన మొదటి వ్యక్తిగా నిలిచారు. 'ఇండియన్ కాన్‌స్టిట్యూషన్ డెవలప్మెంట్ త్రూ జుడీషియల్ ఇంటర్‌ప్రిటేషన్ క్రిటికల్ స్టడీ' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. ఈ పరిశోధనలను ఉస్మానియా యూనివర్సిటీలోని న్యాయశాస్త్ర విభాగ ప్రొఫెసర్ డాక్టర్ జి.వినోద్ కుమార్ ఆధ్వర్యంలో పూర్తిచేశారు. పీహెచ్‌డీ సాధించిన మెహరాజ్‌ను డీఈవో డాక్టర్ రవీందర్‌రెడ్డి తన కార్యాలయంలో శనివారం సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు షబ్బీర్ అలీ, జుట్టు గజేందర్, రాజేశ్‌నాయక్, మసియుద్దీన్, సర్ఫరాజ్, అన్సార్, భూమన్నయాదవ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్

నిర్మల్‌చైన్‌గేట్: ఖరీఫ్ వడ్లు కొనేందుకు త్వరగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై శనివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ సీజన్ నుంచే సన్నరకం వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాలని, సన్నరకం, దొడ్డు రకం వరి ధాన్య సేకరణ కేంద్రాలు వేర్వేరుగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ కొనుగోలు కేంద్రంలో తగినంత మంది సిబ్బందిని నియమించుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలన్నారు. కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు, తూకం యంత్రాలు, తేమయంత్రాలు, ప్యాడీ క్లీనింగ్ యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రైతులందరికీ మద్దతు ధర, కొనుగోలు కేంద్రం నిర్వాహకుల వివరాలు, టోల్‌ఫ్రీ నంబర్ తెలిపే విధంగా కొనుగోలు కేంద్రాల వద్ద డిస్‌ప్లే ఏర్పాటు చేయాలని తెలిపారు. తాగునీరు, టెంటు, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. గతంలో వంద శాతం సీఎంఆర్ ప్రక్రియ పూర్తి చేసిన మిల్లర్లకు మాత్రమే ధాన్యాన్ని కేటాయించాలన్నారు. లారీ ట్రాన్స్‌పోర్ట్ యజమానులు తగినన్ని లారీలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సివిల్ సప్లయ్ డీఎం వేణుగోపాల్, డీఎస్‌వో కిరణ్‌కుమార్, డీఆర్డీవో విజయలక్ష్మి, మార్కెటింగ్ ఏడీ శ్రీనివాస్, రైస్ మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వహకులు, లారీ ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

శిక్షణతో తాగునీటి సమస్యలు పరిష్కారం



చేతిపంపును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

పెంబి: గ్రామాల్లో మంచినీటి సహాయకుల శిక్షణతో తాగునీటి సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయని అడిషనల్ కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ అన్నారు. మండలంలో మంచినీటి సహాయకుల శిక్షణ శనివారం ముగిసింది. రైతు వేదికలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి అదనపు కలెక్టర్ హాజరై మాట్లాడారు. గ్రామాల్లో చిన్నచిన్న మంచినీటి సమస్యలు తలెత్తినప్పుడు సహాయకులే మరమ్మతులు చేయాలని సూచించారు. క్లోరినేషన్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్‌పై శిక్షణ ఇచ్చారు. 24 గ్రామ పంచాయతీలకు సంబంధించి శిక్షణ పొందిన మంచినీటి సహాయకులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమాకాంత్, ఎంపీవో అనిల్ కుమార్, మిషన్ భగీరథ ఈఈ సందీప్, డీఈ హరీశ్, వెంకటరమణ, ఏఈ విష్ణు, మనోజ్, మంచినీటి శిక్షణ సహాయకులు పాల్గొన్నారు.

ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి



ఆలయ పరిసరాలు పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

బాసర : శ్రీశారదీయ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బాసర జ్ఞానసరస్వతి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగాకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీరాజ్ అధికారి(డీపీవో) శ్రీనివాస్ అధికారులు, పారిశుధ్య సిబ్బందికి సూచించారు. ప్రధాన రోడ్డు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. మురుగు కాలువలు, తాగునీటి కుళాయిలు శుభ్రంగా ఉంచాలని, ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా, దుకాణ సముదాయాల ముందు రోడ్లపై చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ ఈవో గోవిందరాజుకు సూచించారు. అనంతరం జ్ఞానసరస్వతి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. డీపీవో వెంట డీఎల్‌పీవో సుదర్శన్, ఎంపీవో గంగసింగ్, సిబ్బంది ఉన్నారు.

సోయా కొనుగోళ్లు ప్రారంభం

- కేంద్రాలను ప్రారంభించిన ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్



సోయా కొనుగోళ్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

భైంసారూరల్/కుభీర్: జిల్లాలో సోయా పంట కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. మొదటగా భైంసా మండలం మాటేగాంలోని పీఏసీఎస్‌లో, కుభీర్‌లోని వ్యవసాయ మార్కెట్‌లో సోయా కొనుగోళ్లను ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ శనివారం ప్రారంభించారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోళ్లు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పంట రుణాలు మాఫీ చేసే వరకూ రైతుల పక్షాన ఉద్యమిస్తామని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటి వరకు 30 శాతం రైతులకే రుణమాఫీ చేసిందని పేర్కొన్నారు. కుభీర్ మండలానికి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందేలా చూస్తామన్నారు. మండలంలో మరో కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రితో మాట్లాడి ఎకరాకు 10 క్వింటాళ్ల సోయా కొనుగోలు చేసేలా చూస్తామన్నారు. రైతులు సోయా పంటను దళారులకు అమ్మకుండా మార్కెట్‌కు తీసుకవచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమాల్లో మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌కుమార్, ఏడీఏ వీణ, ఏఓ గణేశ్, పీఏసీఎస్ చైర్మన్లు దేవేందర్‌రెడ్డి, రేకుల గంగచరణ్, వైస్ చైర్మన్ చాకెటి లస్మన్న, డైరెక్టర్ చందు, మార్కెట్ కార్యదర్శి గంగాధర్, సీవో క్రాంతికుమార్, నాయకులు సావుల మల్లన్న, వడ్నం నాగేశ్, బంక బాబు, ఏశాల దత్తాత్రి, బషీర్, కనుకయ్య, గులాబ్, మోహినొద్దీన్, అబ్దుల్‌వాహెద్, సుష్మారెడ్డి, తాలోడ్ శ్రీనివాస్, లక్ష్మణ్‌రావుపటేల్, రాజేశ్వర్, హైమద్, నర్సారెడ్డి, పండిత్‌రావు, సోలంకిభీంరావు తదితరులు ఉన్నారు.

గ్లోబల్ సమ్మిట్‌లో మాజీ ఎమ్మెల్యే



జ్ఞాపిక అందిస్తున్న బ్రహ్మకుమారి

భైంసాటౌన్: రాజస్థాన్‌లోని బ్రహ్మకుమారీస్ శాంతివనంలో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో ముథోల్ మాజీ ఎమ్మెల్యే బి.నారాయణ్‌రావు పటేల్ పాల్గొన్నారు. స్పిరిట్యువాలిటీ ఫర్ క్లీన్ అండ్ హెల్తీ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మిట్‌కు ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్, కేంద్ర మంత్రులు హాజరయ్యారు. బ్రహ్మకుమారీలు ఆయనకు జ్ఞాపిక అందజేశారు.

కేసులు త్వరగా పరిష్కరించాలి

భైంసాటౌన్: పెండింగ్ కేసులు సత్వర పరిష్కారానికి కృషి చేయాలని భైంసా కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అరుణ అన్నారు. తన కార్యాలయంలో డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసులు, ఇతర అంశాలపై చర్చించారు. సమావేశంలో సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

మొరం మాఫియాపై చర్య తీసుకోవాలి



మొరం తవ్వకాలు చూపుతున్న చైర్మన్, నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని 110 ఎకరాల ప్రభుత్వ భూముల్లో పగలు, రాత్రి తేడాలేకుండా అక్రమంగా మొరం తవ్వకాలు జరుపుతున్నారని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు దయానంద్, నిమ్మల రమేశ్ తెలిపారు. మొరం మాఫియాపై చర్య తీసుకోవాలని పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలో అక్రమ తవ్వకాలు చేపట్టిన ప్రాంతాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడారు.. మొరం మాఫియాపై చర్య తీసుకోవాలని కలెక్టర్, మైనింగ్, పోలీసు తదితర శాఖల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. మొరం తవ్వకందారులు కాంగ్రెస్ నాయకులకు డబ్బులు ఇచ్చినట్లు సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారాన్ని ఖండించారు. ఎమ్మెల్యేపై సైతం ఆరోపణలు చేసిన వారిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. దందాలో తమపార్టీ నాయకుల ప్రమేయం ఉన్నట్లు నిర్ధారణ అయితే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి మొరం దందాపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందించారు. తాను ఇప్పటికే కలెక్టర్, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశానని తహసీల్దార్ నాయకులకు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్‌పాషా, మాజీ వైస్ ఎంపీపీ తోట సత్యం, నాయకుడు శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ



బతుకమ్మకు పూజలు చేస్తున్న జడ్జి దేవేంద్రబాబు

భైంసాటౌన్: తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ అని భైంసా కోర్టు న్యాయమూర్తి డి.దేవేంద్రబాబు అన్నారు. కోర్టు ఆవరణలో శనివారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. జడ్జి బతుకమ్మకు పూజలు చేసి కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం మహిళా న్యాయవాదులు, కోర్టు సిబ్బంది బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యం చేశారు. కార్యక్రమంలో ఏపీపీ అరుణ, న్యాయవాదులు, సిబ్బంది ఉన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు కడెం విద్యార్థి



సయ్యద్ ఫర్హాన్

కడెం: రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాల విద్యార్థి సయ్యద్ ఫర్హాన్ ఎంపికయ్యాడని హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, పీడీ బి.వెంకటరమణ తెలిపారు. ఈనెల14 నుంచి 17 వరకు గద్వాలలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జోనల్‌స్థాయి జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడని పేర్కొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఫర్హాన్‌ను అభినందించారు.

క్లుప్తంగా

'ట్రిపుల్‌ఐటీపై విచారణ చేపట్టండి'



డిప్యూటీ సీఎంకు వినతిపత్రం ఇస్తున్న ఓయూ జేఏసీ నేతలు

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని కోరుతూ ఓయూ జేఏసీ నేతలు శనివారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గా బాసర ట్రిపుల్‌ఐటీ ఇన్‌చార్జి వీసీగా జోడు పదవుల్లో కొనసాగుతూ అనేక అక్రమాలకు పాల్పడిన ప్రొఫెసర్ వెంకటరమణను వెంటనే తొలగించాలని డిమాండ్‌చేశారు. ఇన్‌చార్జి వీసీ నకిలీ బిల్లులు సృష్టించి డబ్బులు కాజేశారని ఇందుకు సంబంధించి తమ వద్ద ఆధారాలు ఉన్నాయని ఆరోపించారు. ఉద్యోగులను వేధిస్తూ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని అన్నారు. కాలం ముగిసిన టెండర్లు వేయకుండా పర్సంటేజీలు తీసుకుంటూ పాత వారినే కొనసాగిస్తున్న వైనంపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సర్దార్ వినోద్‌కుమార్, పేరాల ప్రశాంత్, రంజిత్‌కుమార్, ప్రవీణ్, దిలీప్, శేఖర్‌యాదవ్, వికాస్‌యాదవ్ ఉన్నారు.

ముఖరా(కే)ను ఆదర్శంగా తీసుకోవాలి



మీనాక్షికి మెమొంటో అందజేస్తున్న అనితారామచంద్రన్

ఇచ్చోడ: రాష్ట్రంలోని ఆయా పంచాయతీలు ముఖ రా(కే)ను ఆదర్శంగా తీసుకొని ప్రగతి బాటలో నడవాలని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్ అన్నారు. హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మీ నాక్షి, ఎంపీటీసీ సుభాష్‌ను అభినందించి మెమొంటోలు అందజేశారు. చెత్త ద్వారా ఆదాయం, సోలార్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి, ఇంకుడు గుంతల ద్వారా భూగర్భ జలాలను పెంపొందించుకొని ముఖరా(కే) జీపీ ఆదర్శంగా నిలిచిందన్నారు. ఇందులో స్టేట్ ఫైనాన్స్ కమిషనర్ సిరిసిల్ల రాజయ్య, సెర్ప్ కార్యదర్శి దివ్యదేవరాజన్, ఫైనాన్స్ కార్యదర్శి స్మితా సబర్వాల్ పాల్గొన్నారు.

పేకాటస్థావరంపై దాడి

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని నౌగాంబస్తీలో ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాటస్థావరంపై పట్టణ పోలీసులు శనివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులో తీసుకుని వారి వద్ద నుంచి రూ.13,070 నగదుతోపాటు ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని పట్టణ ఎస్సై సుధాకర్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పేకాటఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

గోదారమ్మ చెంతకు..



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



పోలీసు బందోబస్తు మధ్య అమ్మవారి ఆభరణాల వెంట వెళ్తున్న భక్తులు

- అడెల్లి పోచమ్మ ఆభరణాలు
- కాలినడకన తరలిన భక్తులు
- ప్రారంభమైన గంగనీళ్ల మహా జాతర
- నేడు అమ్మవారికి ఆభరణాల అలంకరణ

సారంగాపూర్: అడెల్లిలోని మహాపోచమ్మ గంగనీళ్ల జాతర శనివారం ఘనంగా ప్రారంభమైంది. దిలావర్‌పూర్ మండలం సాంగ్వీ సమీపంలోని గోదావరి చెంతకు అమ్మవారి ఆభరణాలను భక్తులు కాలినడకన తరలించడంతో జాతర మొదలైంది. అడెల్లి, సారంగాపూర్, కౌట్ల(బి), జామ్, ధని, మలక్‌చించోలి, బీరవెల్లి, వంజర్, ప్యారమూర్ తదితర గ్రామాల భక్తులు అమ్మవారికి పూజలు చేశారు. ప్రధాన అర్చకుడు శ్రీనివాసశర్మ, ఇన్‌చార్జి ఈవో రమేశ్ ఆధ్వర్యంలో ఆభరణాలు మూటకట్టారు. ఆలయం చుట్టూ ఐదుసార్లు ప్రదక్షిణల తర్వాత ఆభరణాలు, మూలవిరాట్‌కు పూజలు నిర్వహించారు. సేవదారులు తమ తలపై ఆభరణాలు ధరించి కాలినడకన గోదావరి నదికి పయనం కాగా, భక్తులు వెంట వెళ్లారు. తొలుత ఆలయంలో ప్రారంభమైన ఆభరణాల ఊరేగింపు సారంగాపూర్ మండలంలోని అడెల్లి, సారంగాపూర్, యాకర్‌పెల్లి, వంజర్, ప్యారమూర్, గ్రామాల మీదుగా దిలావర్‌పూర్ మండలంలోని కదిలి, మాటేగాం, దిలావర్‌పూర్, కంజర్, సాంగ్వీ గ్రామాల గుండా గోదావరి నది తీరానికి రాత్రివరకు చేరుకోనున్నాయి.

మంగళహారతులతో స్వాగతం..

అమ్మవారి ఆభరణాలు గ్రామాల గుండా ఊరేగింపుగా వెళ్తుండటంతో మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి గ్రామ పొలిమేర వరకు సాగనంపారు. గంగపుత్రులు ఆనవాయితీ ప్రకారం..తమ పనిముట్లయిన వలలతో గొడుగుపట్టి అమ్మవారి అనుగ్రహానికి పాత్రులయ్యారు. ఆభరణాల భద్రత కోసం నిర్మల్‌రూరల్ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో సారంగాపూర్ ఎస్సై శ్రీకాంత్ బందోబస్తు ఏర్పాటు చేశారు. తిరిగి మళ్లీ ఆదివారం ఉదయం నగలశుద్ధి, పవిత్ర గోదావరి నదిలోని నీటితో జలాభిషేకం అనంతరం సాయంత్రానికి ఆలయానికి చేరుకోవడంతో జాతర ముగియనుంది.



గోదావరి నదికి తరలివెళ్తున్న భక్తులు

గడముంతల్లో గంగాజలాలు

అమ్మవారి ఆభరణాల వెంట గోదావరినదికి బయల్దేరి వెళ్లిన భక్తులు గడముంతల్లో గంగానది జలాలను వెంట తీసుకువస్తారు. తొలుత గడముంతల్లో తీసుకువచ్చిన నదీజలాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణల అనంతరం అమ్మవారికి జలాభిషేకం చేస్తారు. ఆ నీటిని ఇళ్లలో, పంట పొలాల్లో చల్లితే పాడి పంటలు, పిల్లాపాపలు చల్లగా ఉంటాయని వారి నమ్మకం. గ్రామాల్లో అమ్మవారికి భక్తులు సమర్పించే బంగారం(పసుపు)ను తమవెంట తీసుకువచ్చి ఇళ్లలో పూజలు చేయడం ఆనవాయితీ. నుదుటన పసుపు పెట్టుకుంటే మంచి జరుగుతుందని వారి విశ్వాసం.

జాతర ఏర్పాట్ల పర్యవేక్షణ

సుమారు లక్షకుపైగా భక్తులు తరలిరానున్నారు. ఇన్‌చార్జి ఈవో రమేశ్ ఎస్సై శ్రీకాంత్ జాతర ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ సదుపాయం, రోడ్డు బాగుచేయించడం తదితర పనులు దగ్గరుండి పూర్తి చేయించారు. ఈ ఏడాది త్వరగా అమ్మవారి ఆభరణాలను ఆలయానికి చేర్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నారు. సాంగ్వీ గ్రామం భక్తజన సంద్రమైంది. శనివారం రాత్రి అమ్మవారి ఆభరణాలు గ్రామానికి చేరుకున్నాయి. గోదావరి నది వద్ద ఆభరణాలకు శుద్ధి తర్వాత భక్తులు పూజలు చేశారు.

బందోబస్తుపై దృష్టి పెట్టాలి

- ఎస్పీ జానకీ షర్మిల

దిలావర్‌పూర్: అడెల్లి పోచమ్మ (గంగనీళ్ల) జాతర నేపథ్యంలో పోలీసులు బందోబస్తుపై దృష్టిపెట్టాలని ఎస్పీ జానకీ షర్మిల పేర్కొన్నారు. శనివారం సాంగ్వి గ్రామంలోని పోచమ్మ, అన్నపూర్ణ దేవి ఆలయంలో ఆమె పూజలు చేశారు. గోదావరినది తీరాన్ని పరిశీలించి పోలీసులతో సమావేశమై పలు సూచనలు అందజేశారు. ఆదివారం ఉదయం అమ్మవారి ఆభరణాలు అడెల్లి ఆలయానికి తీసుకువెళ్లే గ్రామాలపై బందోబస్తుపై దృష్టి పెట్టాలన్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అంతకుముందు గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఎస్పీతోపాటు నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, నిర్మల్ రూరల్ సీఐ రామకృష్ణలను సన్మానించారు. దిలావర్‌పూర్ ఎస్సై ఎల్.సందీప్, సిబ్బంది తదితరులు ఉన్నారు.



గోదావరి నది తీరాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

సింగరేణిలో రాజకీయ జోక్యం

- టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి



మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

శ్రీరాంపూర్: సింగరేణిలో గతంలో ఎన్నడూ లేనంతగా రాజకీయం జోక్యం పెరిగిందని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి తెలిపారు. శనివారం ఆయన ఆర్కే 6 గనిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులతో మాట్లాడారు. సంస్థ కార్యకలాపాల్లో, ఆర్థిక వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని తెలిపారు. కార్మికులకు రావాల్సిన లాభాల వాటలో అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రప్రభుత్వం, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీలు కలిసి కార్మికులకు అన్యాయం చేశాయన్నారు. రూ.4701 కోట్ల నుంచి 33 శాతం లాభాల వాటా రూ.1551 కోట్లు చెల్లించాల్సి ఉండగా కేవలం రూ.976 కోట్లు మాత్రమే చెల్లించారన్నారు. వాస్తవ లాభాల నుంచి కాకుండా పెట్టుబడి పేరుతో లాభాల్లో కోతపెట్టి కార్మికులకు నష్టం చేసిందన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తూ ఈ వైఖరికి నిరసనగా ఆదివారం గోదావరిఖనిలో చౌరస్తాలో టీబీజీకేఎస్, బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బ్రాంచి ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, కేంద్ర కమిటీ నాయకులు బండి రమేశ్, పానుగంటి సత్తయ్య, పొగాకు రమేశ్, అన్వేష్‌రెడ్డి, ముత్యాల రమేశ్, డివిజన్ నాయకులు గొర్ల సంతోష్, మహిపాల్‌రెడ్డి, పానుగంటి తిరుపతి, ఉత్తేజిరెడ్డి, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

బాసరలో సాంస్కృతిక కార్యక్రమాలు



ఆలయంలో వీణ వాయిస్తున్న నిర్వాహకులు

బాసర: బాసర జ్ఞాన సరస్వతి ఆలయంలో నిర్వహిస్తున్న శారదీయ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సాంస్కృతిక, భక్తి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన సప్తస్వరాలు ఇనిస్టిట్యూట్ మృదంగం బృందం నిర్వాహకులు మల్లికార్జున, లక్ష్మీపద్మావతి, సుచిత్ర, ఉమ బృందం శనివారం వీణ వాయిద్య కార్యక్రమం నిర్వహించారు.

అమ్మవారిని దర్శించుకున్న జగదీష్ మహరాజ్



అమ్మవారిని దర్శించుకున్న జగదీష్ మహరాజ్

మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా గాడిపుర జగదీష్మహారాజ్ శనివారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్పాటక్ అమ్మవారి హారతినిచ్చి, తీర్థప్రసాదాలు అందజేశారు. దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు జగదీష్మహారాజ్, దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా అన్నప్రసాదం అందజేస్తారు.

అమ్మవారి దయ ఉండాలి

- ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, సూర్యనారాయణ గుప్తా



పాదయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు

ఆదిలాబాద్: జగదాంబ అమ్మవారి దయ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆదిలాబాద్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, సూర్య నారాయణ గుప్తా అన్నారు. మహారాష్ట్రలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కేలాపూర్ జగదాంబ దేవి ఆలయానికి చేపట్టిన భక్తుల పాదయాత్రను జిల్లా కేంద్రంలోని శ్రీరాణి సతీజీ ఆలయం వద్ద శనివారం ప్రారంభించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లా నుంచి ఏటా వందలాది భక్తులు కేలాపూర్ ఆలయానికి వెళ్తుంటారన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. ఇందులో జగదాంబదేవి భక్తమండలి, బీజేపీ నాయకులు, భక్తులు తదితరులున్నారు.

స్ప్రే బాటిళ్లు పేలి కానిస్టేబుల్‌కు గాయాలు



గాయాలపాలైన సురేశ్

తాంసి: స్ప్రే బాటిళ్లు పేలి ఓ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలైన సంఘటన మండలకేంద్రంలో చోటు చేసుకుంది. శనివారం ఉదయం పోలీసుస్టేషన్ ఆవరణ శుభ్రం చేసి చెత్తకు నిప్పుపెట్టారు. ఈ క్రమంలో అందులో ఉన్న స్ప్రే బాటిళ్లు ఒకసారిగా పేలడంతో పక్కనే ఉన్న కానిస్టేబుల్ సురేశ్‌కు తలకు, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. బాటిళ్లలో ఉన్న గ్యాస్ ప్రభావానికి చేతి చర్మం ఊడిపోయింది. వెంటనే గాయపడిన కానిస్టేబుల్‌ను ఎస్సై శివరాం, సిబ్బందితో కలిసి వాహనంలో రిమ్స్‌కు తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు.

కారు బోల్తా..ముగ్గురికి..



బోల్తాపడిన కారు

గుడిహత్నూర్: మండలంలోని జాతీయరహదారి డొంగర్‌గావ్ సమీపంలో శనివారం సాయంత్రం కారు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలైనట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..ఇంద్రవెల్లి మండలానికి చెందిన పృథ్వీరాజ్, అక్షయ్, కాంబ్లే కిరణ్‌లు గుడిహత్నూర్ నుంచి హైదరబాద్‌కు కారులో వెళ్తున్నారు. డొంగ్రగావ్ సమీపంలో కారు వెనుక టైరు పగిలిపోవడంతో అదుపు తప్పి బోల్తా పడింది. గమనించిన స్థానికులు గాయపడిన వారిని అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి..





గాయపడ్డ యోగేష్, దీపిక

ముధోల్: మండల కేంద్రంలోని బసవా గార్డెన్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కల్యాపూర్ గ్రామానికి చెందిన యోగేష్ తన భార్య దీపికతో భైంసా వైపు నుంచి బాసరకు బైక్‌పై వెళ్తున్నాడు. ముధోల్ మండలం చించాలకు చెందిన రాకేశ్, కుభీర్ మండలానికి చెందిన సాయిప్రసాద్ కలిసి బైక్‌పై నిజామాబాద్‌కు వస్తున్నారు. మార్గమధ్యలో యోగేష్ దీపిక వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యోగేష్‌కు తీవ్రంగా, దీపికకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని ఆటోలో ఆస్పత్రికి, అక్కడి నుంచి భైంసాకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆసుపత్రికి పంపించారు. కాగా, ఎస్సై సాయికిరణ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఆత్మహత్య



శంకర్ (ఫైల్)

కడెం: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండలంలోని కన్నాపూర్ పంచాయతీ పరిధిలోని వకీల్‌నగర్ గ్రామానికి చెందిన తొడసం శంకర్(25) గత కొంత కాలంగా మతిస్థిమితం కోల్పోయాడు. ఈనెల 4న రాత్రి కుటుంబీకులు నిద్రించిన సమయంలో ఇంటి ఎదుట పందిరి దూలానికి ఉరేసుకున్నాడు. తండ్రి లస్ము ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగిన వృద్ధుడు..

కౌటాల: జీవితంపై విరక్తితో వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడాడు. కౌటాల ఎస్సై ఎస్.మధుకర్ కథనం ప్రకారం.. కౌటాల పంచాయతీ పరిధిలోని కోయగూడ గ్రామానికి చెందిన గుర్లె పోచయ్య (75) గత కొన్నిరోజులుగా వృద్ధాప్యంతో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. అలాగే మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది ఈనెల 2న ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ శనివారం ఉదయం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కుమారుడు కిషన్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్సపొందుతూ యువకుడు మృతి



ప్రశాంత్ (ఫైల్)

దహెగాం: బైక్ అదుపుతప్పి గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై కందూరి రాజు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మొర్లె ప్రశాంత్(22) ఈనెల 2న పత్తి చేనుకు క్రిమిసంహారక మందులు పిచికారి చేయడానికి బైక్‌పై వెళ్లాడు. హత్తిని సమీపంలో అదుపు తప్పి కిందపడిపోయాడు. రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ప్రశాంత్‌ను అంబులెన్సులో దహెగాం పీహెచ్‌సీకి, అటు నుంచి బెల్లంపల్లి, మంచిర్యాల ఆసుపత్రికి పంపించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. తండ్రి నారాయణ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మట్కా నిర్వాహకుడు అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: మట్కా నిర్వాహకుడిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై అశోక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..పట్టణంలోని పంజాబ్ చౌక్‌లో శనివారం నిర్వహించిన వాహనాలు తనిఖీలో భాగంగా కొత్త కుమ్మరివాడకు చెందిన కోట పురుషోత్తంను సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ ద్వారా మట్కా ఆడుతున్నట్లు గుర్తించారు. ఆయనను విచారించగా మట్కా ఆడేందుకు షేక్ నజీం, అజీంలు డబ్బులు పంపినట్లు తెలిపాడు. ఈమేరకు కేసు నమోదు చేసి పురుషోత్తంను అరెస్టు చేయగా, ఇద్దరికోసం గాలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. నిర్వాహకుడి నుంచి మట్కా చిట్టీలు, సెల్‌ఫోన్‌తోపాటు రూ.8770 నగదు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

గేదెల దొంగల పట్టివేత

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసుస్టేషన్ పరిధిలో గేదెలను ఎత్తుకెళ్లిన ముగ్గురు దొంగలను శనివారం పట్టుకున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలోని రాంనగర్‌కు చెందిన షేక్ ఇంతియాజ్, మోయిన్ ఖాన్, న్యూహౌజింగ్ బోర్డుకు చెందిన ఇంతియాజ్ ఖాన్‌లు ఇటీవల 5 గేదెలను ఎత్తుకెళ్లారు. మావల పరిసర ప్రాంతాల్లో గేదెలను మేపుతుండగా పట్టుకున్నట్లు వివరించారు. ముగ్గురు నుంచి రెండు గేదెలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మిగిలిన గేదెలను గుర్తుతెలియని వ్యక్తులకు విక్రయించినట్లు విచారణలో తెలిపారని ఎస్సై పేర్కొన్నారు. దస్నాపూర్‌కు చెందిన ఐలయ్య, రాంనగర్‌కు చెందిన కె.శ్రీనివాస్‌ల గేదెలుగా గుర్తించినట్లు ఎస్సై తెలిపారు.

కొండచిలువ కలకలం



కౌటాల: మండల కేంద్రంలోని మినీ స్టేడియం సమీపంలో శనివారం కొండ చిలువ కలకలం రేపింది. కొండచిలువ చెట్టుకు చుట్టుకుని ఉండటాన్ని స్థానికులు గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని కొండచిలువను పట్టుకుని అడవిలో వదిలేశారు. కొండచిలువను చూసేందుకు స్థానికులు తరలివచ్చారు.

అక్రమ కట్టడాల కూల్చివేతపై ఆందోళన



ఆందోళనకారులకు నచ్చజెప్పుతున్న పోలీసులు

- మేజర్ పంచాయతీ కార్యాలయం ఎదుట గిరిజనేతరుల రాస్తారోకో
- రెండు గంటల పాటు ట్రాఫిక్ జాం
- సబ్ కలెక్టర్‌తో చర్చలు.. ఆందోళన విరమణ



గిరిజనేతర పెద్దలతో చర్చిస్తున్న సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్

ఇంద్రవెల్లి: కలెక్టర్ ఆదేశాలతో మండలకేంద్రంలో అక్రమ కట్టడాలను అధికారులు జేసీబీతో కూల్చివేశారు. ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, రెవెన్యూ, పంచాయతీ అధికారులు పోలీసుల బందోబస్తు మధ్య శనివారం తెల్లవారుజాము 4 గంటలకు కూల్చివేతలు చేపట్టారు. వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట నాలా కబ్జా చేసి నిర్మించిన సోన్‌కాంబ్లే దేవిదాస్ ఇల్లు, అందునాయక్‌తండా చౌక్ సమీపంలో అనుమతి లేకుండా నిర్మిస్తున్న సాబ్లే శ్యామ్‌రావ్ చెందిన నాలుగు పిల్లర్లను జేసీబీతో కూల్చివేశారు. అధికారులు తీరు నిరసిస్తూ ఉదయం 9 గంటలకు గిరిజనేతరులు ఆందోళనకు దిగారు. మేజర్ పంచాయతీ కార్యాలయం ఎదుట రాస్తారోకో చేపట్టి బైఠాయించడంతో ఉద్రిక్తత నెలకొంది. జిల్లా కలెక్టర్ రావాలని పట్టుబట్టారు. సుమారు రెండు గంటల రాస్తారోకోతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌గౌడ్, సీఐ మొగిలి, ఎస్సై సునీల్ అక్కడికి చేరుకున్నారు. సబ్ కలెక్టర్ వస్తున్నారని రాస్తారోకో విరమించాలని డీఎస్పీ కోరగా, వారు శాంతించలేదు. ఈ సందర్భంగా గిరిజనేతర పెద్దలు మాట్లాడుతూ ఆదివాసీలతో తమకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. గిరిజనులతో కలిసి జీవనం సాగిస్తున్న పేదలకు చెందిన గిరిజనేతరుల ఇళ్లను ప్రభుత్వం కూల్చివేసిందన్నారు. ఇళ్ల కూల్చివేత ముందు తమపై బుల్డోజర్లు ఎక్కించాలన్నారు. కాగా, సబ్ కలెక్టర్ అక్కడికి చేరుకుని వారితో చర్చించడంతో ఆందోళన విరమించారు. డబ్బులు తీసుకుని అనుమతి ఇచ్చిన పంచాయతీ అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ పట్టా భూముల్లో నిర్మించిన ఇళ్ల జోలికి వెళ్లలేదని, ప్రభుత్వ భూములు, నాలాపై కబ్జా చేసి అక్రమంగా నిర్మించిన కట్టడాలకు నోటీసులు ఇచ్చాకే కూల్చివేశామన్నారు. అనుమతి లేకుండా అక్రమ కట్టడాలు చేపడితే కూల్చివేయడంతోపాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇంద్రవెల్లి పటేల్ మారుతి డోంగ్రె, గిరిజనేతర పెద్దలు సంజీవ్ లహనే, కేశావ్ ముస్లే, బాబు ముండే, తహరే గణేశ్, సంతోష్ జైస్వాల్, జవహర్ లాల్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు చాంపియన్



ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు

ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు చాంపియన్‌గా నిలిచిందని ఎస్జీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివరావు తెలిపారు. నారాయణపేట జిల్లాలో ఈనెల 3 నుంచి 5 వరకు నిర్వహించిన అండర్–17 బాల,బాలికలకు నిర్వహించిన రాష్ట్రస్థాయి హ్యాండ్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు ప్రతిభకనబర్చి చాంపియన్ కైవసం చేసుకుందని పేర్కొన్నారు. సెమీఫైనల్‌లో వరంగల్ జట్టు, ఫైనల్‌లో కరీంనగర్ జట్టుపై విజయం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. పోటీల్లో ప్రతిభకనబర్చిన ఉమ్మడి ఆదిలాబాద్ జట్టులో ఆసిఫాబాద్ ఆదర్శ క్రీడ పాఠశాల విద్యార్థినులు సత్యభామ, నందిని, అంజలి, కవిత, శిరీష, అనూష, జ్యోతి, కోచ్ అరవింద్‌ను డీఎస్‌వో మీనారెడ్డి, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్ అభినందించారు. కోచ్ రాకేశ్, విశాల్, సాయి పాల్గొన్నారు.